క్లుప్తంగా

మంత్రిని విమర్శిస్తే ఉపేక్షించేది లేదు

బీఆర్ఎస్ మహిళా నేత ఇందిర

కందుకూరు: ఇటీవల పార్టీ మారిన కొత్త మనోహర్‌రెడ్డి.. మంత్రి సబితారెడ్డిపై విమర్శలు చేస్తే ఉపేక్షించేదిలేదని బీఆర్ఎస్ మండల మహిళా అధ్యక్షురాలు టి.ఇందిరాదేవేందర్ హెచ్చరించారు. ఆదివారం ఆమె కందుకూరులో మాట్లాడారు. మహేశ్వరం నియోజకవర్గం అభివృద్ధికి మంత్రి ఎంతో చేస్తున్నారని.. ఆమె చేస్తున్న అభివృద్ధి చూసి ఓర్వలేకనే భూకబ్జాలు చేస్తున్నారంటూ అనవసరంగా మంత్రిని విమర్శించడం మానుకోవాలని హితవుపలికారు. ఆమె వెంట పార్టీ మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

మ్యాన్‌హోళ్లు తొలగించరూ..



టీచర్స్‌కాలనీ నుంచి నందిహిల్స్‌కు వెళ్లే రోడ్డుపై మ్యాన్‌హోళ్లు

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధి టీచర్స్ కాలనీ నుంచి నందిహిల్స్ ప్రధాన రహదారిని ఇటీవల అభివృద్ధి చేసిన విషయం తెలిసిందే. రోడ్డు అభివృద్ధి పూర్తయ్యాక కొన్నిరోజుల పాటు డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు కిందకు రహదారి పైకి ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. తాజాగా అధికారులు మ్యానహోళ్లను రోడ్డుకు సమాంతరంగా చేసినప్పటికీ పనులు జరిగిన చోట పాత మ్యాన్‌హోళ్లను అలాగే వదిలేయడంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి రోడ్డుపై ఉన్న మ్యాన్‌హోళ్ల మూతలను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

మండల కేంద్రంగా ప్రకటించాలి



ఎమ్మెల్యే దిష్టిబొమ్మను దహనం చేస్తున్న గట్టుపల్లి గ్రామస్తులు

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని ఆ గ్రామ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. మండల ఏర్పాటు కోసం గతంలో జేఏసీ ఆధ్వర్యంలో 41 రోజులు నిరాహార దీక్షలు చేశామని గుర్తు చేశారు. దీక్షా శిబిరాన్ని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సందర్శించి గట్టుఇప్పలపల్లిని మండలంగా ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చి ఇప్పటికీ నెరవేర్చలేదన్నారు. ఎమ్మెల్యే హామీని విస్మరించడాన్ని నిరసిస్తూ జేఏసీ ఆధ్వర్యంలో ప్రజలు ఆదివారం గ్రామ ప్రధాన కూడళ్లల్లో ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఇప్పటికే మండలం ఏర్పాటు చేయాలని ఆర్డీఓ, కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశామన్నారు. మండలం ఏర్పాటు చేసేంతవరకు ఉద్యమిస్తామన్నారు.

పెండింగ్ పనులు పూర్తిచేయాలి: కార్పొరేటర్

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఆర్‌కేపురం డివిజన్ కార్పొరేటర్ రాధధీరజ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆర్‌కెపురంలో డివిజన్‌లోని అల్కాపురి, మార్గదర్శికాలనీ, ఎన్టీఆర్‌నగర్ తదితర కాలనీలలో పర్యటించారు. కాలనీవాసులను కలసి కాలనీ సమస్యలను తెలుసుకున్నారు. డివిజన్‌లోని పెండింగి పనులను పరిశీలించారు. డివిజన్‌లో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను కార్పొరేటర్ కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపి నాయకులు, కాలనీ అసోసియేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక



కిషన్‌సింగ్‌ను సన్మానిస్తున్న సభ్యులు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్ బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా శ్రీనునాయక్, అధ్యక్షుడిగా లోనావత్ కిషన్‌సింగ్, ప్రధాన కార్యదర్శి కేతావత్ శ్రీనునాయక్, కోశాధికారి రామలింగం, ఉపాధ్యక్షులు కేతావత్ జేత్యానాయక్, సంయుక్త కార్యదర్శి మకట్‌లాల్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజ్‌కుమార్, భాస్కర్, ముఖ్య సలహాదారులుగా భాస్య నాయక్, నరేందర్ నాయక్, శ్రీనివాస్, రమేష్, కోశాధికారి రమేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా హేమాలాల్‌ను ఎన్నుకున్నారు.

ఆదర్శంగా ఎల్‌బీనగర్ నియోజకవర్గం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



హాజరైన వివిధ కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు

ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

వనస్థలిపురం: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి నగరంలోని ఇతర నియోజకవర్గాలకు ఆదర్శంగా నిలుస్తోందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం వనస్థలిపురం డివిజన్ పరిధి లోని ఎఫ్‌సీఐ కాలనీలో జరిగిన వివిధ కాలనీల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు తమ కాలనీలలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతు ప్రణాళికాబద్ధంగా కాలనీలలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. కరోనా సమయం మినహాయించి గత 5 సంవత్సరాలుగా ఎల్‌బీనగర్‌లో అభివృద్ధి శరవేగంగా జరుగుతోందని అన్నారు. పెరుగుతున్న జనాభా, వాహనాలు, ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఎల్‌బీనగర్‌లో ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. రాబోయే తరాలకు ఇబ్బందులు తలెత్తకుండా దీర్ఘ కాలిక ప్రణాళికలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యతను ఇస్తోందని, అందులో భాగంగా ఎల్‌బీనగర్ కొత్తపేటలో రూ. 1200 కోట్లతో టిమ్స్ ఆసుపత్రిని నిర్మిస్తోందని అన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మెట్రో రైలు, బస్సులు తదితర పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టంను అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి తప్ప ఇతర ఎమ్మెల్యేలు చేసిందేమి లేదని, పార్కులు, ప్లే గ్రౌండ్‌లు, స్విమ్మింగ్ పూల్‌లు, కమ్యూనిటిహాళ్ల నిర్మాణం తన హయాంలోనే జరిగాయని అన్నారు. నాగోలులో అంతర్జాతీయ స్థాయిలో స్మశాన వాటిక నిర్మాణం చేశామని, రాబోయే రోజుల్లో ఆటోనగర్ వద్ద అంతర్జాతీయ స్థాయిలో బస్ టెర్మినల్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. కాలనీలలో నెలకొన్న రోడ్ల ప్యాచ్‌వర్క్ పనులు, డ్రైనేజి సమస్యలు, కమ్యూనిటిహాళ్ల నిర్మాణం, సీసీ కెమెరాల ఏర్పాటు తదితర సమస్యలను ఒకటి, రెండు నెలల్లో పూర్తి చేస్తామని అన్నారు. ప్రతిపక్ష నాయకులు తమ ఉనికి కోసం కనిపిస్తున్న అభివృద్ధిని మరచి రాజకీయ లబ్ధి కోసం వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు చింతల రవికుమార్ అధ్యక్షతన జరిగిన మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, నాయకులు గంగుల కృష్ణారెడ్డి, కుంట్లూరు వెంకటేష్‌గౌడ్, ఈశ్వరమ్మ యాదవ్, సిరిగిరి రాంరెడ్డి, ఖైసర్, పీవీఎస్.రావు, వేములయ్యగౌడ్, ఆనంద్‌రాజ్, శ్రీనివాస్ యాదవ్, అజయ్ యాదవ్ పాల్గొన్నారు.

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం



కేంద్ర పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న అందెల శ్రీరాములు, నాయకులు

పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల

బడంగ్‌పేట్: మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ చేపట్టిన జన్ సంపర్క్ అభియాన్ పాదయాత్ర ఆదివారం (11వ రోజు) గుర్రంగూడకు చేరుకుంది. గడపగడపకు పాదయాత్రలో భాగంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకుని ముందుకు సాగుతున్నారు. ప్రధాని నరేంద్రమోడీ తొమ్మిదేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగుతున్నారు. అందెల శ్రీరాములు యాదవ్ మాట్లాడుతూ.. కార్పొరేషన్‌లోని ఏ కాలనీకి వెళ్లినా అవుట్‌లేట్ లేదని అన్నారు. కల్లబొల్లి మాటలతో ప్రజలను మోసం చేస్తున్నవారిని నమ్మవద్దని కోరారు. బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కార్పోరేటర్లు శంకర్, గడ్డం లక్ష్మారెడ్డి, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ అభివృద్ధి ఫలాలు అందాలి

ఎల్‌బీనగర్: మోదీ సర్కార్ రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రచారం చేయాల్సిన బాధ్యత బీజేపీ కార్యకర్తలపై ఉందని బీఎన్‌రెడ్డి డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. ఆదివారం మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆయన బీజేపీ అల్పకాలిక విస్తారక్ అశోక్‌కుమార్‌తో కలసి డివిజన్ పరిధిలోని సచివాలయనగర్, గౌతమీనగర్, సాహెబ్‌నగర్ కాలనీలలో ఇంటింటికీ వెళ్ళి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రచారం చేశారు. అనంతరం బీఎన్‌రెడ్డిలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో లచ్చిరెడ్డి మాట్లాడుతూ...బీజేపీని బూత్‌స్థాయి నుంచి మరింత మలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతీ కార్యకర్తపై ఉందని గుర్తుచేశారు. అనంతరం ఆయన వెంకటేశ్వర కాలనీలో పాదయాత్ర నిర్వహించి కాలనీ లేఅవుట్ బోర్డును ఆవిష్కరించారు.కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ కార్యవర్గ సభ్యులు వనపల్లి శ్రీనివాస్, నాయకులు విష్ణువర్ధన్‌రావు, శరత్‌కుమార్, శివశంకర్‌గౌడ్, జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర కాలనీసంక్షేమ సంఘ ప్రతినిధులు కృష్ణ, వెంకటేష్, లక్ష్మణాచారి, యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ఆమనగల్లు: మున్సిపాలిటీ పరిధిలోని సాకిబండతండాలో నేనావత్ కొమిటి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. బాధిత కుటుంబాన్ని ఆచారి సేవాదళం సభ్యులు ఆదివారం పరామర్శించి రూ.5 వేలు ఆర్థికసాయం అందించారు. పరామర్శించిన వారిలో నియోజకవర్గ బీజేపీ మీడియా కన్వీనర్ రవిరాథోడ్, ఆచారి సేవాదళం సభ్యులు మహేశ్, ఆనంద్, శ్రీనివాస్, కిట్టు, వంశీ, కరుణాకర్, సురేశ్, సక్రి, గోపి, నరేశ్, రవీందర్, రమేశ్ తదితరులు ఉన్నారు.

పదోన్నతులు కల్పించండి

ఇబ్రహీంపట్నం: జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖలో పనిచేసే నాల్గవ తరగతి ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని మంత్రి హరీశ్‌రావుకు ఆదివారం వినతిపత్రాన్ని అందజేసినట్లు ఆ యూనియన్ నాయకులు రమేష్‌కుమార్ తెలిపారు. అర్హులైన వారికి పదోన్నతులు కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ఆమనగల్లు సీఐగా వెంకటేశ్వర్లు

ఆమనగల్లు: ఆమనగల్లు సీఐగా వెంకటేశ్వర్లు బదిలీపై వచ్చారు. ఆమనగల్లు సీఐగా పనిచేసిన జ్వాల ఉపేందర్ జూన్ 25న ఇక్కడి నుంచి అల్వాల్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. దీంతో చెవేళ్లలో సీఐగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు ఆమనగల్లు సీఐగా బదిలీపై వచ్చి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు.

నేడు గురుపౌర్ణమి వేడుకలు

అబ్దుల్లాపూర్‌మెట్: మండల కేంద్రంలోని శ్రీ ద్వారకా షిర్డీ సాయిబాబ ఆలయంలో సోమవారం గురు పూజా మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు కాశీనాథుని సత్యనారాయణశర్మ, కాశీనాథుని వంశీకృష్ణ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

ఆమనగల్లు పట్టణంలో

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని శ్రీ సద్గురు నిత్యశుద్ధానంద స్వామి క్షేత్రం, రామదూత క్షేత్రంలో సోమవారం శ్రీ శివానంద స్వామి ఆధ్వర్యంలో గురుపూర్ణిమ పూజ మహోత్సవ, ఉత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఉత్సవ నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

మొండిగౌరెల్లిలో 'ముదిరాజ్' భవనం ప్రారంభం



భవన ప్రారంభోత్సవంలో నేతలు

యాచారం: మండల పరిధిలోని మొండిగౌరెల్లి గ్రామంలో ఆదివారం ముదిరాజ్ సంఘం భవనాన్ని సర్పంచ్ కృష్ణ, ఎంపీటీసీ సభ్యురాలు తాండ్ర లక్ష్మమ్మ, ఉప సర్పంచ్ మేకల యాదగిరిరెడ్డి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ... ముదిరాజులు ఐక్యంగా ఉండి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక ప్రగతి సాధించాలని కోరారు. అనంతరం నూతన కార్యాలయం ముందు జెండావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం గ్రామశాఖ అధ్యక్షుడు తీగల దశరథ, కమిటీ సభ్యులు యాదయ్య, భరత్‌కుమార్, భిక్షపతి, జంగయ్య, వెంకటేష్, కిష్టయ్య, వార్డుసభ్యులు అంజమ్మ, లక్ష్మయ్య, రేణుక, గ్రామస్తులు మల్లారెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అన్నివర్గాల అభివృద్ధి

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: అంకితభావంతో ప్రజాసేవ చేసే వారు వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. శేరిగూడలోని సీకే కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ, సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. అన్నివర్గాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత బీఆర్ఎస్ పార్టీదన్నారు. తెలంగాణ మోడల్‌పై దేశవ్యాప్తంగా చర్చ జరగాలనే బీఆర్ఎస్ పార్టీ దేశ ప్రజల ముందుకు వచ్చిందన్నారు. సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలను కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్, మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకటరమణారెడ్డి, రైతుబంధు జిల్లా అధ్యక్షులు లక్ష్మారెడ్డి, ఎంపీపీ కృపేశ్, నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి..

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి కమ్మగూడలోని శ్రీనగర్ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం శ్రీనగర్ కాలనీవాసులు ఎమ్మెల్యే కిషన్‌రెడ్డిని కలిసి డ్రైనేజీ, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సహకరించాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వినోద్‌గౌడ్, శ్రీకాంత్‌చారి, కాలనీవాసులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

డ్రైనేజీ సమస్య తీర్చండి..

యాచారం: మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకు ఎదురుగా ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి కాలనీలో డ్రైనేజీ సమస్య వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని.. వెంటనే నిధులు మంజూరు చేసి సమస్య తీర్చాలని ఆ కాలనీవాసులు ఆదివారం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే అధికారులను కాలనీకి పంపి నివేదిక అనంతరం కావాల్సిన నిధుల మంజూరుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. శ్రీనువాస్‌చారి తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం..

ఇబ్రహీంపట్నం రూరల్: ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి పేర్కొన్నారు. ఆదిబట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్‌కు చెందిన కాకి నర్సింహ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందాడు. ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి సిఫారసు మేరకు రూ.30వేల చెక్కు మంజూరైంది. ఈచెక్కును ఆదివారం ఎమ్మెల్యే మంచిరెడ్డి లబ్ధిదారుడికి అందజేశారు. కౌన్సిలర్లు మహేందర్, శ్రీనివాస్, హరిదాసుగౌడ్, నాయకులు రవీందర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతో సంతృప్తి

రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ చైర్మన్ శంకర్

హుడాకాంప్లెక్స్: నిరుపేదలకు సహాయం అందించడమే తమ లక్ష్యమని రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ చైర్మన్ పెద్ది శంకర్ అన్నారు. బీటీనాయుడు పుట్టిన రోజును పురస్కరించుకుని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉస్మానియా ఆస్పత్రిలో రోగులకు ఆహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ ఓల్డేజ్ హోం కొన్నేళ్లుగా సేవా కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఉస్మానియా ఆస్పత్రి ఆవరణలో రోగులకు వారితో పాటు వచ్చే సహాయకులకు సుమారుగా 400 నుంచి 500 మందికి అన్నప్రసాద వితరణ చేశామని.. ఇలా ప్రతి ఆదివారం ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా అన్నప్రసాదం ఉంటుందని తెలిపారు. సేవా కార్యక్రమాలతో సంతృప్తి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, చైతన్య, లక్ష్మణ్, రాజు, ప్రవీణ్‌గుప్తా, శివనేత, నితిన్, కొండా శివ తదితరులు పాల్గొన్నారు.



రోగుల సహాయకులకు అన్నదానం చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

జనగర్జనకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

మహేశ్వరం: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఖమ్మంలో జరిగిన జనగర్జన బహిరంగ సభకు మహేశ్వరం మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యర్తలు భారీగా తరలివెళ్లారు. డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, టీపీసీసీ కార్యదర్శి చిగురింత పారిజాత నర్సింహారెడ్డి, సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాలు, తండాల నుంచి తరలివెళ్లారు. మండల ఎస్టీసెల్ అధ్యక్షుడు రాజునాయక్, యూత్ అధ్యక్షుడు రాజు, సీనియర్ నాయకులు గాన్సీరామ్ నాయక్, శివ, మోహన్‌నాయక్, ఆనంద్ నాయక్, సేవ్యానాయక్, రవి, భరత్, రవి, కుమార్, జంగయ్య, నారాయణ, యాదయ్య, శ్రీను ఉన్నారు.



జనగర్జనకు తరలివెళ్తున్న నాయకులు

ముదిరాజ్ సంఘం నూతన కమిటీ ఎన్నిక

మహేశ్వరం: మహేశ్వరం మండల ముదిరాజ్ సంఘం నూతన అధ్యక్షుడిగా మహేశ్వరం గ్రామానికి చెందిన కాకి కుమార్ ముదిరాజ్ ఎకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం మండల కేంద్రంలోని మహంకాళీ అమ్మవారి ఆలయంలో మండల ముదిరాజ్ సంఘం ముఖ్య నాయకులు సమావేశమై నూతన మండల ముదిరాజ్ సంఘం కార్యవర్గాన్ని రాష్ట్ర ముదిరాజ్ సంఘం ప్రచార కార్యదర్శి కర్రోళ్ల చంద్రయ్య ముదిరాజ్ సమక్షంలో ఎన్నుకున్నారు.

నూతన కార్యవర్గం...

మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా కాకి కుమార్ ముదిరాజ్, ఉపాధ్యక్షులుగా అమీర్‌పేట్ రాములు ముదిరాజ్, తవిటి నర్సింహ ముదిరాజ్, రాజమోని చిన్నరాజు ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి నీరటి జగదీశ్వర్ ముదిరాజ్, సహాయ కార్యదర్శి రాసుల కృష్ణ ముదిరాజ్, కోశాధికారిగా కటికల మైసయ్య ముదిరాజ్, కార్యవర్గ సభ్యులుగా సంకటి నాగరాజు ముదిరాజ్, మండల ముదిరాజ్ సంఘం యూత్ కమిటీ అధ్యక్షుడిగా మదిలాపురం నర్సింహ ముదిరాజ్, ఉపాధ్యక్షులుగా రాజమోని మహేందర్ ముదిరాజ్‌ను ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు వారికి నియామకపత్రాలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సీనియర్ నాయకులు నర్సింహ ముదిరాజ్, అంజయ్య ముదిరాజ్, కాకి ఈశ్వర్ ముదిరాజ్, కృష్ణ ముదిరాజ్, లింగం ముదిరాజ్ రాజేష్, శ్రీనివాస్ ముదిరాజ్ పలువురు పాల్గొన్నారు.

'కేంద్రం నిధులతో గ్రామాల అభివృద్ధి'

తలకొండపల్లి: కేంద్ర నిధులతో గ్రామాల అభివృద్ధి జరుగుతుందని స్వర్ణశక్తికర్ణ అభియాన్ పనుల పర్యవేక్షకుడు షణ్ముగ సుందర్ అన్నారు. రానున్న సాధారణ ఎన్నికల్లో కల్వకుర్తి నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగుర వేసేందుకు కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా పనిచేయాలని పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని చెన్నారంలోని 24వ నంబర్ బూత్‌లో స్వర్ణశక్తి పనుల్లో భాగంగా పార్టీ పటిష్టత, తొమ్మిదేళ్లలో పీఎం నరేంద్రమోదీ అమలు చేస్తున్న సంక్షేమాభివృద్ధి పథకాల గురించి క్షేత్రస్థాయిలో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ బలోపేతం కోసం ఏమి చేయాలని తగు సూచనలు, సలహాలు ఆయన అందజేశారు. తదుపరి ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని చేపట్టారు. కేంద్ర పథకాల గురించి కరపత్రాలను పంపిణీ చేశారు. కల్వకుర్తి నియోజకవర్గంలో బీజేపీ గెలుపునకు పోరాటం చేయాల్సిన అవసరం ప్రతి కార్యకర్త పైన ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు తిర్మణి రవిగౌడ్, ప్రధాన కార్యదర్శి హరికాంత్, ఉప సర్పంచ్ వరలక్ష్మీ, రామాంజనేయులు, బూత్ కమిటీ అధ్యక్షుడు ఎగిరే శెట్టి, యాదగిరి, పాండు, మల్లారెడ్డి, శివ, వీరయ్య, శ్రీకాంత్, శ్రీశైలం, నరహరి, కృష్ణయ్య, శక్తి కేంద్ర ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.



చెన్నారంలో అవగాహన కల్పిస్తున్న బీజేపీ నాయకులు

రైతు సమస్యలు పట్టని సర్కార్

వైఎస్సార్‌టీపీ నేత జంగయ్యగౌడ్

మంచాల: గ్రామాల్లోని అసైన్‌మెంట్ పట్టా భూములు కలిగిన రైతులకు ప్రభుత్వం పట్టా పాసు పుస్తకాలు ఇవ్వాలని వైఎస్సార్‌టీపీ నాయకుడు మాదగోని జంగయ్యగౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మంచాలలో మాట్లాడుతూ.. గ్రామాల్లో చాలామంది నిరుపేద ప్రజలకు అసైన్‌మెంట్ పట్టా భూములు ఉన్నాయన్నారు. గతంలో అసైన్‌మెంట్ పట్టా భూములకు కూడా బ్యాంకు రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రస్తుత బీఆర్ఎస్ సర్కార్ అసైన్‌మెంట్ భూములు గల రైతులకు బ్యాంకు రుణాలు ఇవ్వకపోగా చివరికి పట్టా పాసు పుస్తకాలు కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు.అసైన్‌మెంట్ పట్టా భూములు కలిగిన రైతులకు న్యాయం చేయాలని అన్నారు.

శరవేగంగా 'బోగస్' ఏరివేత

- బీఎల్‌ఓల ఇంటింటి సర్వే
- ఆధార్ అనుసంధానంతో భారీగా బోగస్ ఓటర్ల గుర్తింపు
- కొత్త ఓటర్ల నమోదుపై అవగాహన కార్యక్రమాలు

యాచారం: మండలంలో ఓటర్ల జాబితా ప్రక్షాళన కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నారు. ఇప్పటికే ఓటర్ కార్డులకు ఆధార్ అనుసంధానం చేయడంతో మేజర్ బోగస్ ఓట్లు తొలగించారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు కీలకమైన ఈ బాధ్యతలను బీఎల్‌ఓ(బూత్ లెవల్ ఆఫీసర్)లకు అప్పగించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్ పర్యవేక్షణలో బీఎల్‌ఓలు గ్రామాల్లో ఇంటింటికి తిరిగి రికార్డుల్లో ఉన్న ఓటర్ల అదే అడ్రస్‌లో ఉన్నారా, ఎవరైనా చనిపోయారా, గ్రామాల్లో ఉండని వారు ఎంతమంది, ఆధార్ అనుసంధానంతో వారి పేర్లు తొలగించబడ్డాయా తదితన వివరాలను సేకరిస్తున్నారు. ఓటర్ల లిస్టులోంచి తొలగించే పేర్లను నమోదు చేసి తహసీల్దార్‌కు నివేదిక అందజేస్తున్నారు. యాచారం మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లోని 59 బూత్‌లలో బీఎల్‌ఓలు ఇంటింటి సర్వే చేస్తున్నారు. వారి దగ్గర ఉన్న డాటా, స్థానిక ప్రజాప్రతినిధుల సూచనల మేరకు బోగస్ ఓటర్లను తొలగిస్తున్నారు. మరణించినారి, బోగస్ ఓటర్ల తొలగింపులో ఉన్నతాధికారులు బీఎల్‌ఓల ద్వారా ధ్రువీకరణ పత్రాలు తీసుకుంటున్నారు.

3,500కు పైగా ఓట్ల తొలగింపు..

యాచారం మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో 59 బూత్‌లలో మరణించిన వారితో పాటు పెద్ద సంఖ్యలో బోగస్ ఓటర్లు ఉన్నట్లు ఇంటింటి సర్వేలో బీఎల్‌ఓలు గుర్తించారు. మొత్తం ఓట్లు 47వేలకు పైగా ఉండగా ఏరివేత అనంతరం 44,425 ఓట్లు మాత్రమే ఉన్నాయి. నందివనపర్తి, యాచారం, మాల్, చింతుల్ల, తక్కళ్లపల్లి, నక్కర్తమేడిపల్లి, గునుగల్, చౌదర్‌పల్లి, చింతపట్ల, మొండిగౌరెల్లి తదితర గ్రామాల్లో ఏళ్ల కింద పలు ప్రాంతాల నుంచి వలస వచ్చి ఇక్కడే పౌల్ట్రీఫాం, డెయిరీఫాం, ఇటుక బట్టీల్లో, క్వారీల్లో, క్రషర్లో పనులు చేసుకుంటూ జీవనోపాధి పొందారు. వారందరి ఓట్లను స్థానిక నేతలు ఓటరు జాబితాల్లో నమోదు చేశారు. అలాంటి ఓటర్లు ప్రస్తుతం గ్రామాల్లో లేకపోవడంతో సర్వేలో బీఎల్‌ఓలు తొలగిస్తున్నారు. అదే విధంగా ఆధార్‌కు ఓటర్ల కార్డులను అనుసంధానం చేయడంతో నగరంలో స్థిరపడిన చాలామంది గ్రామాల్లో కాకుండా నగరంలోని అడ్రస్‌లకే వాటిని అనుసంధానం చేసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. అలాంటి వారి ఓట్లు తొలగించబడ్డాయి.

కొత్త ఓటర్ల నమోదుపై..

ఓటర్ ప్రక్షళనతో పాటు కొత్త ఓటర్ల నమోదుపై పై కూడా బీఎల్‌ఓలు యువతలో చైతన్యం కల్పిస్తున్నారు. 18 ఏళ్లు నిండిన యువతీయువకులను ఓటర్‌గా నమోదు చేసుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో దాదాపు 500కు పైగా యువత 18 ఏళ్లు నిండి, మరో 250 మంది యువతకు మరో రెండు నెలల్లో 18 ఏళ్లు నిండిన వారు ఉన్నట్లు గుర్తించారు. వారందరూ ఓటర్లుగా నమోదు చేసుకునేలా బీఎల్ ఓలు కృషి చేస్తున్నారు.



యాచారం తహసీల్దార్ కార్యాలయం

బీఎల్‌ఓలకు సహకరించాలి



మండలంలోని బోగస్ ఓటర్ల తీసివేత విషయంలో బీఎల్‌ఓలకు కచ్చితమైన ఆదేశాలు ఇచ్చాం. ఓట్ల తీసివేతపై బీఎల్‌ఓల ద్వారా ధ్రువీకరణ పత్రాలు తీసుకుంటున్నాం. అలాగే 18 ఏళ్లు నిండిన యువతీయవకులను కొత్త ఓటర్లగా నమోదు చేసుకునేలా చైతన్యం కల్పించేలా సూచించాం. బోగస్ ఓట్ల తొలగింపు, కొత్త ఓటర్ల నమోదుపై ప్రజాప్రతినిధులు కూడా బీఎల్‌ఓలకు సహకరించాలి.

– సుచరిత, తహసీల్దార్, యాచారం